

మనం


కడప | అన్నమయ్య



## చమర్తి జగన్ మోహన్ రాజు యూత్ క్రికెట్ టోర్నమెంట్

వీరబల్లి మే 30(మనం న్యూస్) వీరబల్లి మండలం లో గెలిచినా వారికి మొదటి బహుమతి లికొండూరు శరత్ కుమార్ రాజు 50000 రెండవ బహుమతి అమరేశ్వర్ రాజు 30000 రాజంపేట టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు గారి ఆదేశాను సారం 03-06-2026 జరగబోవు క్రికెట్ గ్రౌండ్ ను పరిశీలించిన వీరబల్లి సింగిల్ విండో అధ్యక్షులు అమరేశ్వర రాజు వంటిమిట్ట ఓజ్ఎ ముద్దు కృష్ణ రెడ్డి, శ్రీనివాస రాజు,వీరబల్లి కో - క్లస్టర్ రమేష్ రాజంపేట ఐటీడీపి జనరల్ సెక్రటరీ సాయి రాజు,ఐటీడీపి మండల కన్వీనర్ రమణ,జాఫర్, చందు, హరి తేజ, రామాంజి, సచిన్ వీరబల్లి మండల ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.










## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి : జనసేన శ్రేణులకు పిలుపు

**రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు**

సుండుపల్లి మనం న్యూస్ మే 30
కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లె మండలంలో జనసేన పార్టీ మండల నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం జనసేన పార్టీ మండల నాయకులు షేక్ సలీం గారి ఆధ్వర్యంలో జరిగింది. సుండుపల్లె పర్యటనలో భాగంగా ఈ సమావేశంలో పాల్గొన్న రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ యల్లటూరు శ్రీనివాస రాజు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ బలమైన స్థానాన్ని సంపాదించేలా ప్రతి నాయ కుడు, జనసైనికుడు, వీర మహిళ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని, జనసేన జెండాను ప్రతి గ్రామంలో మరింత బలంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీర మహిళ రెడ్డి రాణి, రామ శ్రీనివాసులు ,షేక్ మున్నా, కాజా ,బాల ,నూరుల్లా ఖాన్ ,రఫీక్ ,రహిమాన్ ,సుహాయల్, హబీబ్, నగేష్ మరియు మండల స్థాయి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు మరియు పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమాజానికి దిశానిర్దేశం చేసే టార్చిలైట్‌లా వార్తలు ఉండాలి



**విలేకరులకు రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, మే 30 (మనం న్యూస్)
మీడియా అందించే ప్రతి వార్త సమాజానికి వెలుగు చూపే టార్చిలైట్‌లా ఉండాలని, ప్రజలను ఆలోచింపజేస్తూ సామాజిక మార్పుకు వారధిగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా గ్రామీణ విలేకరులకు సూచించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ అధ్యక్షత వహించగా, శిక్షకులుగా సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వర రావు, ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మీడియా ప్రతినిధులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాల్గవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం, త్వరలోనే మూడో స్థానానికి చేరుకునే దిశగా పయనించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. దేశ అభివృద్ధిలో మీడియా పాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషించే స్థాయి లోకి ఎదగాలని సూచించారు. ప్రస్తుతం మీడియా ద్వారా అందుతున్న సమాచారం సమాజానికి, ప్రభుత్వ పరిపాలనకు పరిమిత స్థాయిలో మాత్రమే ఉపయోగపడుతోందని, భవిష్యత్తులో వార్తలు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా, కనీసం 70శాతం మేర ఉపయోగకరంగా ఉండేలా విలేకరులు తమ ఆలోచనా విధానాన్ని, విశ్లేషణాత్మక దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు. వార్త అనేది కేవలం సంఘటన వివరణ మాత్రమే కాదు; అది సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి. ప్రజల్లో చైతన్యం పెంచుతూ, సమస్యలపై చర్చకు దారి తీస్తూ, పరిష్కార మార్గాలను సూచించగలగాలి" అని ఆయన సూచించారు. ఇరవై ఏళ్ల క్రితం సమాజంలో, పరిపాలనలో కనిపించిన ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యానికి బలమని, ఆ విలువలను తిరిగి బలోపేతం చేసే దిశగా మీడియా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, నిర్మాణాత్మక చర్చకు దోహదపడే కథనాలను అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. పాత్రికేయులకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉన్నప్పటికీ వ్యక్తులు, సమాజం లేదా ప్రభుత్వ వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా బాధ్యతారహితంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా సమానంగా ఉండాలని, ప్రతి జర్నలిస్టు వృత్తి నైతిక విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. డిజిటల్ యుగంలో కంటెంట్ క్రియేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందని, విలేకరులు కేవలం వార్తల సేకరణకే పరిమితం కాకుండా విశ్లేషణాత్మక, సమాచార ప్రధాన, ప్రజోపయోగ కంటెంట్ రూపొందించడంపై దృష్టి సారించాలని సూచించారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ మీడియా, ఆధునిక సమాచార సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. పాత్రికేయులు ప్రజాస్వామ్యానికి కాపలాదారులు కావాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ ప్రజలకు నిష్పాక్షిక, బాధ్యతాయుత సమాచారాన్ని అందించాలన్నారు.
మీడియా చరిత్రను ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం రగిలించేందుకు పత్రికలు కీలక పాత్ర పోషించాయని, అనంతరం ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే సాధనంగా నిలిచాయని గుర్తు చేశారు. అయితే కాలక్రమేణా వాణిజ్య ధోరణులు, రాజకీయ ప్రభావాలు, పోటీ వాతావరణం పెరగడంతో జర్నలిజం మూల విలువలు కొంత మేర దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
మీడియా రంగం తన విశ్వసనీయతను కాపాడుకోవాలంటే నిజాయితీ, నిష్పాక్షికత, సామాజిక బాధ్యతలను ప్రధానంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే జర్నలిస్టుల ప్రధాన కర్తవ్యమని, ఏ పరిస్థితుల్లోనూ పక్షపాత ధోరణికి తావివ్వకూడదన్నారు. సోషల్ మీడియా విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన ప్రస్తుత కాలంలో సమాచారాన్ని ధృవీకరించి మాత్రమే ప్రచారం చేయాలని ఆయన సూచించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ మాట్లాడుతూ.. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం, గ్రామీణ ప్రాంత పాత్రికేయులకు వృత్తిపరమైన మెళకువలు అందించడం కోసం అకాడమీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టుల సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ స్థాయి జర్నలిస్టులకు నిర్వహిస్తున్న ఇటువంటి పునశ్చరణ తరగతులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో కూడా అకాడమీ మరిన్ని శిక్షణా కార్యక్రమాలను చేపడుతుందని ఆమె తెలిపారు. ఎపి యుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సమాజ హితం, ప్రజా చైతన్యం, అభివృద్ధి లక్ష్యాల సాధనలో మీడియా ఒక శక్తివంతమైన భాగస్వామిగా నిలవాలని ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మీడియా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిందని ఆయన కొనియాడారు. ప్రత్యక్ష సమావేశాలకు పరిమితులు ఉన్నప్పటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఆన్‌లైన్ వేదికల ద్వారా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జర్నలిస్టుల అభ్యాసానికి దోహదపడుతోందన్నారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి జర్నలిస్టులు కేవలం సంఘటనలను నమోదు చేసే వారిగా కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించి ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించే బాధ్యతాయుత పాత్రికేయులుగా ఎదగాలని సూచించారు. గ్రామీణ జర్నలిస్టులే మీడియా వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే సంఘటనలు, ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులను ముందుగా గుర్తించి సమాజం దృష్టికి తీసుకువచ్చేది గ్రామీణ విలేకరులేనని అన్నారు. వార్త రాయడంలో ఐదు ముఖ్యమైన అంశాలు... ఏమి జరిగింది, ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎవరు సంబంధితులు, ఎందుకు జరిగింది ? అనే అంశాలపై స్పష్టత ఉండాలని వివరించారు. ఒక మంచి వార్త ప్రజలకు సమాచారం ఇవ్వడమే కాకుండా సమస్యల పరిష్కారానికి మార్గం చూపేలా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రింట్ అండ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు తదితర మీడియా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.



## స్మార్ట్ పోలీసింగ్‌తో రాష్ట్రంలోనే అగ్రగామిగా జిల్లాను నిలిపేందుకు కృషి చేయాలి

**రౌడీ లు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి**

**నేర సమీక్షా సమావేశంలో వై.ఎస్ఆర్ కడప జిల్లా ఎస్.పి షెల్కేనచికేత్**



కడప మే30(మనం న్యూస్) స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్ అయిన CEIR, ఈ-సాక్ష్య, సి.సి.టి.ఎన్.ఎస్, ఈ- సమ్మన్స్ తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించడం ద్వారా రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా నిలిపేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గారు పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి స్మార్ట్ పోలీసింగ్ పై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి సంబంధిత నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించిన అనంతరం జిల్లా ఎస్.పీ గారు స్మార్ట్ పోలీసింగ్ మాడ్యూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ-ఆఫీస్‌ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఎస్.పి ఆదేశించారు. డ్రోన్ టెక్నాలజీ ని వినియో గించి నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్) గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి ఇతర శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపుల వద్ద అతివేగం, వేగ నియంత్రణ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా ఎస్.పి గారు ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసారు.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి, పగలు గస్తీ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. గతంలో జరిగిన ప్రాపర్టీ నేరాలలో సొత్తు రికవరీ చేయాలని, రికవరీ శాతం పెంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మహిళలపై నేరాలు జరగకుండా శక్తి టీముల నిఘా పెంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) శ్రీ కె.ప్రకాష్ బాబు, రాజంపేట ఏ.ఎస్.పి మనోజ్ రామనాథ్ హెగ్డే, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, కడప ఇంచార్జ్ డి.ఎస్.పి ఇ.బాలస్వామిరెడ్డి, జమ్మలమడుగు డి.ఎస్.పి కె.వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరు ఏ.ఎస్.పి విబు కృష్ణ ఐ.పి.ఎస్, పులివెందుల డి.ఎస్.పి బి.మురళి నాయక్, మైదుకూరు డి.ఎస్.పి జి.రాజేంద్రప్రసాద్, సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

# ఉచిత యోగా మరియు శంఖానాధ శిక్షణా శిబిర ముగింపు ఉత్సవం - ఆహ్వానం

పుల్లంపేట మే 30 ( మనం న్యూస్): విశ్వ హిందూ పరిషత్ – బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధిని దేవి సమేత శ్రీ శాంతిలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గత నెల రోజులుగా నిర్వహించిన "ఉచిత యోగా మరియు శంఖానాధ శిక్షణ శిబిరం" విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణా శిబిరంలో పాల్గొని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించిన అభ్యర్థులందరికీ ఈరోజు సర్టిఫికెట్స్ (ధృవీకరణ పత్రాలు) పంపిణీ చేయబడును.కావున, శిక్షణ పొందిన అభ్యర్థులందరూ మరియు వారి తల్లిదండ్రులు తప్పక విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము.

కార్యక్రమ వివరాలు:

తేది: ఈరోజు (30 మే 2026, శనివారం)

సమయం: సాయంత్రం 05:00 గంటలకు

వేదిక: శ్రీ శాంతిలింగేశ్వర స్వామి వారి ఆలయం (శివాలయం), పుల్లంపేట.

మన హైందవ సనాతన ధర్మాన్ని రక్షిద్దాం

విశ్వ హిందూ పరిషత్ – బజరంగ్ దళ్

# సామాన్య కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం




పుల్లంపేట, మే 30 మనం న్యూస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన పార్టీ పదవుల నియామకాలలో ఉమ్మడి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దండ్లోపల్లి గ్రామానికి చెందిన గద్దె వెంకటేష్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా నియమించారు.

ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్త అయిన తనను గుర్తించి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎంపీ మిథున్ రెడ్డి, రైల్వే కోడూరు ఇన్‌చార్జి కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, ధ్వజారెడ్డి రాయలసీమ యువజన కోఆర్డినేటర్ హేమంత్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎలకచర్ల శివారెడ్డి తదితర నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తోటి పార్టీ యువ నాయకులతో కార్యకర్తలతో సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని వెంకటేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు సమీప మిత్రులు మాట్లాడుతూ, గతంలో కూడా పుల్లంపేట మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సేవలందించిన వెంకటేష్‌కు పార్టీ గుర్తింపు దక్కడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.

## కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెడుతుంది

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్రెడ్డి



ప్రొద్దుటూరు మనం న్యూస్ మే 30: మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు జగన్ పై అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ కు దిగుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4, 8, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన వెంటనే చంద్రబాబు నాయుడు మరో కొత్త కథనం అల్లి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమై రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టడానికే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. "లిక్కర్ స్కాం" పేరుతో పాత ఆరోపణలను మళ్లీ తెరపైకి తీసుకువచ్చి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల కూటమి నాయకులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవడం కూడా రాజకీయ ఒత్తిడుల భాగమని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ వ్యక్తిగత సహాయకుడు కేఎన్‌ఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, రూ.19 కోట్ల లావాదేవీలపై ప్రశ్నలు వస్తున్నాయని తెలిపారు. అలాగే చంద్రబాబు నాయుడు ఆస్తుల పెరుగుదలపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై పారదర్శకంగా సమగ్ర విచారణ జరగాలని రాచమల్లు డిమాండ్ చేశారు. మీడియా సంస్థల యజమానుల ఆస్తులపై కూడా దర్యాప్తు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ గతంలో జైలు జీవితం అనుభవించినా ఏ పరిస్థితుల్లోనూ బెదిరే వ్యక్తి కాదని, ఇప్పుడూ అక్రమ కేసులకు భయపడరని ఆయన అన్నారు.

# కార్మికవర్గ ఐక్యత పోరాటమే సీఐటీయూ లక్ష్యం!



రైల్వే కోడూరు, మే 30, మనం న్యూస్

కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ,ప్రజాస్వామ్య విలువల రక్షణ,మత సామరస్య పరిరక్షణ,సామాజిక న్యాయం సాధన అనే మహత్తర లక్ష్యాలతో 1970 మే 30న ఏర్పడిన సెంటర్‌ఆఫ్‌ఇండియట్రేడ్యూనియన్స్(సీఐటీయూ) దేశ కార్మిక ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు, సిహెచ్ చంద్రశేఖర్, తెలిపారు. శనివారం రైల్వే కోడూర్, ఎండిఓ ఆఫీస్ వద్ద, సిఐటియు జెండా ఆవిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూసిఐటియు స్థాపన నాటి నుండి నేటి వరకు సిఐటీయూ కేవలం వేతనాల పెంపు,నియమాల పరిరక్షణ కోసం మాత్రమే కాకుండా,కార్మిక వర్గాన్ని సమాజ మార్పు దిశగా చైతన్యపరిచే శక్తిగా ఎదిగింది.కార్మికుడు కేవలం తన పని స్థలంలో వచ్చిన సమస్యలతో పరిమితం కాకుండా,దేశ రాజకీయాలు,ఆర్థిక విధానాలు,సామాజిక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని భావించి,కార్మికులలో రాజకీయ చైతన్యం పెంపొందించడంలో సిఐటీయూ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని తెలిపారు.దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచే ప్రయివేటీకరణ,ప్రజా సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కార్పొరేటీకరణ,ఉద్యోగ భద్రతను దెబ్బతీసే లేబర్ కోడ్స్,వాటి రూల్స్,కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ విధానాల ద్వారా కార్మిక వర్గాన్ని అసంఘటితంగా మార్చే కుట్రలకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరంతర పోరాటం సాగించింది.అవి భవిష్యత్తులో కొనసాగిస్తుంది.ముఖ్యంగా కార్మిక చట్టాలను బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా దేశంలోని వివిధ కేంద్ర కార్మిక సంఘాలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి,ఐక్య పోరాటాలకు నాయకత్వం వహించడం ద్వారా సీఐటీయూ తన పోరాట పటిమను చాటింది.నేడు కోటి మందికి పైగా సభ్యత్వంతో దేశంలో అత్యంత ప్రభావవంతమైన కార్మిక సంఘాల్లో ఒకటిగా నిలవడం,దానిపట్ల కార్మికవర్గ విశ్వాసానికి నిదర్శనం అన్నారు.

దేశీయ స్థాయిలో మాత్రమే కాకుండా అంతర్జాతీయ కార్మిక ఉద్యమంలో కూడా సీఐటీయూ తగిన ముద్రవేసింది. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టియు)లో కీలకపాత్ర పోషిస్తూ, ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ ఐక్యత,సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం,శాంతి,సామాజిక న్యాయం కోసం తన గొంతును వినిపిస్తోంది.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు,యుద్ధ రాజకీయాలు,దోపిడీ శక్తులపై అంతర్జాతీయ ఐక్యత అవసరమని సీఐటీయూ ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తోంది.ఇది కేవలం ఒక ట్రేడ్ యూనియన్ పాత్ర మాత్రమే కాదు,సమానత్వం,న్యాయం, సామ్యవాద దిశగా సమాజాన్ని నడిపించే ఉద్యమ శక్తిగా సీఐటీయూ నిలుస్తుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ,సీఐటీయూ . దేశంలోని కార్మిక వర్గం మాత్రమే కాకుండా రైతాంగం,వ్యవసాయ కార్మికులు,అసంఘటిత రంగ శ్రామికులు,తాడిత పీడిత ప్రజలను ఒక పోరాట వేదికపైకి తీసుకు వస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను,ప్రజల జీవన హక్కులను కాపాడే బాధ్యత సిఐటియు కార్మిక ఉద్యమం మీద మరింత పెరిగిందన్నారు.కార్మిక వర్గం పోరాటం కేవలం ఉద్యోగ హక్కులకే పరిమితం కాకూడదు.దేశ భవిష్యత్తు కోసం,ప్రజల భద్రత కోసం, సమసమాజ నిర్మాణం కోసం జరగాల్సిన సమగ్ర పోరాటం. సీఐటీయూ ఆవిర్భావ రోజు ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు,అది భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేసే రోజు.ఈ రోజు ప్రతి కార్మికుడు ఒక ప్రతిజ్ఞ చేయాల్సిన రోజు."కార్మిక వర్గ ఐక్యతను బలోపేతం చేస్తాం. కార్మిక,రైతు,శ్రామిక వర్గాల ఐక్య పోరాటాలను నిర్మిస్తాం.మత సామరస్యాన్ని కాపాడుతాం. ప్రయివేటీకరణ,కార్పొరేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిలబడతాం. దేశాన్ని నియంతృత్వ,మతోన్మాద, కార్పొరేట్ దోపిడీ శక్తుల నుండి రక్షించేందుకు పోరాడుతాం. సమాజ మార్పు,సామాజిక న్యాయం, సామ్యవాద దిశగా ముందుకు సాగుతాం" అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో, సిఐటియు మండల కార్యదర్శి, పి. జాన్ ప్రసాద్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, రెగ్యులర్ జిల్లా అధ్యక్షులు, కనుపర్తి కిరణ్, రమేష్, విద్యుత్తు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, రాజు,నరసింహ, వివో ఏ జిల్లా నాయకులు, నగిరిపాటి ఆనంద్, వీఆర్ఏ సంఘం, లక్ష్మీకాంత్, ఏపీఎండిసి, మైనింగ్ త్రివేణి సంఘం, కార్యదర్శి, ముత్యాల శ్రీనివాసులు, శివ, సిఐటియు నాయకులు లింగాల యా నాదయ్య, కత్రతోటి హరి నారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు లతీఫ్, కార్తీక్, డివైఎఫ్ఐ నాయకులు, పి. రాజేష్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# పంచ్ ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆర్యవైశ్యుల భారీ ర్యాలీ




ప్రొద్దుటూరు మే 30 మనం న్యూస్: ఆర్యవైశ్య సమాజాన్ని, ఆ సమాజానికి చెందిన ప్రముఖులను కించపరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచ్ ప్రభాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ప్రొద్దుటూరులో ఆర్యవైశ్య సంఘాలు ఆందోళన చేపట్టాయి. వివిధ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎంఆర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేసి, సమాజ భావోద్వేగాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకదారి నరసింహారావు మాట్లాడుతూ, ఆర్యవైశ్య సమాజం వ్యాపార, సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తోందని, అలాంటి సమాజాన్ని అవమానించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత ప్రచారం కోసం సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి బాబు, కాకుమాని ఆనంద్, జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్, వంకదారి నరేంద్రరావు, టంగుటూరి మారుతీ ప్రసాద్ తదితరులతో పాటు వివిధ ఆర్యవైశ్య సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు జన్మదిన వేడుకల్లో యల్లటూరు శ్రీనివాసరాజు



సుండుపల్లె మనం న్యూస్ మే 30: కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని సుండు పల్లె మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ చప్పిడి మహేష్ నాయుడు గారి జన్మదినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ యల్లటూరు శ్రీనివాస రాజు శ్రీ చప్పిడి మహేష్ నాయుడు గారికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సుండుపల్లె బస్టాండ్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్లను నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ప్రారంభించారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, జనసేన మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

